క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కురిచేడు: మండల సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవ్య తెలిపారు. సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహిస్తారని, మండలంలోని అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలని కోరారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన శిక్షలు

బేస్తవారిపేట: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని గిద్దలూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మధు ప్రియాంక హెచ్చరించారు. ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు ఆదేశాల మేరకు వన్యప్రాణుల సంరక్షణపై మండలంలోని జేబీకే పురంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వన్యప్రాణులను చంపితే ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా ఉంటుందన్నారు. 1972 వన్యప్రాణుల చట్టం ప్రకారం వన్యప్రాణులకు ఎటువంటి హాని తలపెట్టవద్దని సూచించారు. వేటకు సంబంధించిన కుక్కలు, మారణాయుధాలు, లైసెన్స్ లేని తుపాకులు కలిగి ఉండటం నేరమన్నారు. వీటిని తీసుకుని బయట ప్రదేశాల్లో తిరిగితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.రంగారెడ్డి, బీట్ ఆఫీసర్ కళ్యాణి, సర్పంచ్ భర్త తిరుపతయ్య గౌడ్ పాల్గొన్నారు.

కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: మండలంలోని ఆదిమూర్తి పల్లెలో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ గ్రీన్ అంబాసిడర్ కార్మికుడిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ చెన్నారావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న పుల్లయ్యను సర్పంచి, కార్యదర్శి ఉద్దేశపూర్వకంగా తొలగించారన్నారు. పుల్లయ్యను తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే ఆయన కుటుంబ సభ్యులతో కలిసి నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, నరసింహులు, షేక్ బాషా, నరసయ్య పాల్గొన్నారు.

నేడు పాఠశాలలు పునఃప్రారంభం

పుల్లలచెరువు: సంక్రాంతి సెలవులు ముగిసిన నేపథ్యంలో గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయని ఎంఈఓ శామ్యూల్ జాన్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమలు చేయని హెచ్‌ఎంలపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంఈఓ బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

ట్రాక్టర్..కారు ఢీ

- నలుగురికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. విజయవాడ నుంచి పొద్దుటూరు వెళ్తున్న కారు దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో పెద ఉల్లగల్లు వద్ద పొలం నుంచి రోడ్డుపైకి వస్తున్న ట్రాక్టర్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎస్.రామయ్య, సుబ్బారెడ్డిలకు, ట్రాక్టర్‌పై ఉన్న జిల్లెలమూడి వెంకటేశ్వర్లు, రమణమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

కందుకూరు అర్బన్: అంకమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. లింగసముద్రం మండలం బలిజపాలెం గ్రామానికి చెందిన హనుమంతరావు, లక్ష్మి కామేశ్వరి దంపతులు, మధుసూదరావు, వెంకటస్వర్ణలత దంపతులు రూ.25,116 నగదును అందజేశారు. కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి వారే యమునా తీరే

- మూడు ముక్కలాటలా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం
- ఇదేం ఖర్మ అంటున్న కార్యకర్తలు

ఉలవపాడు: వారంతా ఒకే పార్టీ నాయకులు.. కానీ ఒకరంటే ఒకరికి పడదు. ఈ సమయంలో వచ్చిన ఎన్‌టీఆర్ వర్ధంతి వారిలో విబేధాలు మరోసారి బయటపడ్డాయి. దీంతో కార్యకర్తలు ఎవరితో మాట్లాడితే ఎవరు ఏమనుకుంటారో అని ఆందోళన పడిన పరిస్థితి మండల పరిధిలో జరిగింది. బుధవారం కరేడులో ఎన్టీఆర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఇందులో టికెట్ ఆశిస్తున్న ముగ్గురు నాయకులు వారి వారి అనుచరగణంతో వేర్వేరుగా హాజరై తమ విబేధాలను అందరికీ చూపించారు. ప్రస్తుత పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాంతో కలిసి వర్ధంతిలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు తన అనుచరులతో కలిసి అదే కార్యక్రమానికి హాజరయ్యారు. నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ తరువాత తన వర్గంతో అదే గ్రామంలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ముగ్గురు వేర్వేరుగా తమ అనుచరులతో హాజరుకావడంతో టీడీపీలో ఉన్న విబేధాలు ఎన్టీఆర్ వర్ధంతి సాక్షిగా మరోసారి బహిర్గతం అయ్యాయి. అసలే పార్టీ ఇబ్బందుల్లో ఉంటే వీరి గోల ఏంటి అని కార్యకర్తలు అంటున్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



పాదిలి జగనన్న లేఔట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ ఎండీ లక్ష్మీషా



ఎండీ సమక్షంలో గృహం ప్రారంభించుకుంటున్న మహిళ

- ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తి
- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ఎండీ లక్ష్మీషా

పొదిలి రూరల్: నవరత్నాలు–పేదలందరికి ఇళ్ల కార్యక్రమంలో భాగంగా పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీషా స్పష్టం చేశారు. బుధవారం పొదిలి విశ్వనాథపురంలోని జగనన్న లేఔట్‌ను ఆయన పరిశీలించారు. తొలుత జగనన్న లే ఔట్ మొత్తం కలయ తిరిగారు. అనంతరం లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. పూర్తైనా ఇళ్లను లబ్ధిదారులతో కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేయించారు. నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులతో శంకుస్థాపన చేయించారు. నిర్మాణంలో ఉన్న గృహాలు పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎండీ లక్ష్మీషా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాష్ట్రంలో 31 లక్షల మంది నిరు పేదలకు ఇళ్లు నిర్మించాలానేది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన అన్నారు. రాష్ట్రంలో 17 వేల జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రలో వచ్చే ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పేదలందరికీ ఇళ్లు ఉండాలనేది ప్రభుత్వం ఉద్దేశమని, ఇల్లు మంజూరైనా ప్రతి లబ్ధిదారుడు కచ్చితంగా గృహాలు నిర్మించుకోవాలని చెప్పారు. చాలాచోట్ల లబ్ధిదారులు ఉత్సాహంగా ముందుకొచ్చి గృహ నిర్మాణాలు చేపట్టారన్నారు. లబ్ధిదారులకు ఏదైనా సాయం అవసరమైతే చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పొదిలి అర్బన్ లేఔట్‌లో మంచి విలువైన స్థలంలో 1603 ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. లేఔట్‌లో 29 కోట్ల రూపాయలతో రోడ్లు లెవల్, నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, అన్ని వసతులు కల్పించామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లు నిర్మించుకోవాలని ఎండీ లక్ష్మీషా కోరారు. ఆయన వెంట నియోజకవర్గ స్పెషలాఫీసర్ జగన్నాథరావు, హౌసింగ్ పీడీ పేరయ్య, డీఈ పవన్‌కుమార్, కనిగిరి, మార్కాపురం ఈఈలు వెంకటస్వామి, కోటిరెడ్డి, మున్సిపాల్ కమిషనర్ డానియల్ జోసఫ్, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే మీ గడపకు వచ్చా



మహిళకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: సమస్యల పరిష్కారానికే మీ గడప ముందుకు వచ్చామని, ప్రతి ఒక్కరి సమస్యలను శ్రద్ధగా విని పరిష్కార మార్గం చూపుతూ ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఉదయం 5వ వార్డు, సాయంత్రం 7వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకుని పరిష్కారం చూపుతూ ముందుకు సాగుతున్నారు. నవరత్నాల ద్వారా అందరికీ సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల అమలు వల్ల ప్రజల కష్టాలు తీరుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు చైర్మన్ జీ. శ్రీనివాసరెడ్డి, వార్డు కౌన్సిలర్ కొత్త కృష్ణ, ఎం.శ్రీనివాసులు, కౌన్సిలర్లు సిరాజ్, మారంరెడ్డి కిట్టు, మహిళ సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు దొడ్డా భాగ్యలక్ష్మి, వై.రంగలక్ష్మమ్మ, బుశ్శెట్టి నాగేశ్వరరావు, నాగఅరుణ, హర్షితబాబి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ బొగ్గరపు శేషయ్య, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, గుంటక చెన్నారెడ్డి, ఉత్తమ్‌కుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, సుష్మిత భూషణకుమారి, షెక్షావలి, ఉస్మాన్, బుదాల సతీష్, గొలమారి శ్రీనివాసరెడ్డి, బండారు శ్రీను, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, డీఈ సుభానీ, మున్సిపల్ ఏఈలు, సచివాలయం, వాలంటీర్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో వస్తువులు విక్రయించుకునేందుకు వేలం

పొదిలి రూరల్: పొదిలి నిర్మమహేశ్వర స్వామి దేవస్థానం, పొదిలి కొండ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాల్లో వస్తువులు అమ్ముకునేందుకు బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.శ్రీనివాసరావు అధ్వర్యంలో బుధవారం పొదిలి నిర్మమహేశ్వ స్వామి దేవస్థానంలో దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహించారు. నిర్మమహేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు కొబ్బరి చిప్పలు పోగు చేసుకోనుట, లడ్డూ ప్రసాదాలు అమ్ముకోనుట, పొదిలి కొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో 2023 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 2024 జనవరి 31 వరకు తలనీలాలు పోగు చేసుకునేందుకు, కొబ్బరికాయలు అమ్ముకునేందుకు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు, లడ్డూ ప్రసాదాలు అమ్ముకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. నిర్మమహేశ్వర ఆలయంలో కొబ్బరి చిప్పల పాట రూ.16,500, లడ్డూ ప్రసాదాలు అమ్ముకొనుటకు రూ.16,500 పాట పాడుకున్నారు. పొదిలి కొండ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో తలనీలాల పాట రూ.5,71,000, కొబ్బరి కాయలు అమ్ముకొనుటకు రూ.1,55,500, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనుటకు రూ. 45,500, లడ్డూ ప్రసాదాలు అమ్ముటకు రూ.81,000 వేలంలో పాడుకున్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కబడ్డీ విజేత చీమకుర్తి జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ముండ్లమూరు: మండలంలోని వేములలో పూర్వ గుంటూరు, ప్రకాశం జిల్లాల కబడ్డీ పోటీల్లో చీమకుర్తి జెడ్పీహెచ్‌ఎస్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. మంగళవారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చీమకుర్తి, గంగన్నపాలెం జట్లు తలపడ్డాయి. ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో చీమకుర్తి జట్టు మొదటి స్థానంలో నిలవగా 35,116 రూపాయలు, గంగన్నపాలెం జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా 20,116 రూపాయలు, మూడో స్థానంలో నిలిచిన వెల్లటూరు జట్టుకు 10,116, నాలుగో స్థానంలో నిలిచిన వేముల జట్టుకు 5,116 రూపాయల నగదు బహూకరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బహుమతులు బహూకరించిన వారిని నిర్వాహకులు సన్మానించారు. మ్యాచ్ నిర్వహకులు బైలడుగు కృష్ణ యాదవ్, మోతుకూరి శేషు, అంబటి శ్రీనివాసరెడ్డి, కుమ్మిత మహేంద్రరెడ్డి, గజ్జల అశోక్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ మొబైల్ శిబిరం

పుల్లలచెరువు: మండలంలో నూతనంగా ఆధార్ నమోదు, అలాగే మార్పుచేర్పుల కోసం శతకోడు, ఐటీ వరం సచివాలయాల్లో ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు మొబైల్ ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. గ్రామాల్లో విద్యార్థులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. శతకోడు ఆధార్ కేంద్రంలో మర్రివేముల సచివాలయం వారు 19 నుంచి 21 వరకు, పుల్లలచెరువు సచివాలయ పరిధిలోని వారు 23, 24 తేదీల్లో, అలాగే ఐటీ వరం కేంద్రంలో ముటుకుల గ్రామస్తులు 19 నుంచి 21వ తేదీ వరకు, చాలపమడుగు సచివాలయ పరిధిలోని ప్రజలు 23, 24వ తేదీల్లో ఆధార్ మొబైల్ క్యాంపునకు రావాలని స్పష్టం చేశారు.

ఆధార్ నమోదు కేంద్రాల ఏర్పాటు

గిద్దలూరు రూరల్: ఎంపిక చేసిన పాఠశాలలు, సచివాలయాల్లో ఈ నెల 19 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు విడతల వారీగా ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు నగర కమిషనర్ రామకృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్షర బ్రిలియంట్ స్కూల్, గీతాంజలీ స్కూల్, స్ప్రింగ్ బోర్డు స్కూల్, హిందు ఎయిడెడ్ స్కూల్, సెయింట్ పాల్స్ ఎయిడెడ్ స్కూల్, రాచర్ల గేట్ రోడ్డు సచివాలయంలో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 5 నుంచి 10 ఏళ్ల వారికి ఆధార్ కార్డు జారీ, సవరణలు, ఫోన్ నంబర్, వేలిముద్రల అప్‌డేట్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు

యర్రగొండపాలెం: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గురువారం నుంచి 24వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఎం.రంగ సుబ్బరాయుడు తెలిపారు. 19న గోళ్లవిడిపి, అమానిగుడిపాడు, మిల్లంపల్లి, కొలుకుల, 20న బోయలపల్లి, వాదంపల్లి, కాశికుంట తండా, కొలుకుల, 21న బోయలపల్లి, వాదంపల్లి, వాదంపల్లి, మొగుళ్లపల్లి, వీరభద్రాపురం, 23న గురిజేపల్లి, గుర్రపుశాల, నరసాయపాలెం, వీరభద్రాపురం, 24న గురిజేపల్లి, గుర్రపుశాల, గంగపాలెం, వెంకటాద్రిపాలెం సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశామని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళకు అరుదైన శస్త్ర చికిత్స

గిద్దలూరు రూరల్: పట్టణంలో డీజీఆర్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలో ఓ మహిళకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అరుదైన శస్త్ర చికిత్స చేశారు. స్థానిక రాజానగర్‌లో నివాసం ఉంటున్న షేక్ ఖాసింబీ ఎనిమిదేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. కడుపులో ఎడమ వైపు ప్లీహం పరిమాణం అనూహ్యంగా పెరుగుతుండటంతో వైద్యశాలకు వచ్చిన ఆమెను డాక్టర్ హరినాథ్‌రెడ్డి పర్యవేక్షణలో కర్నూలు కిమ్స్ వైద్యశాలకు చెందిన ప్రముఖ సర్జన్ డాక్టర్ వసీం హసన్ రాజా, మత్తు వైద్యుడు డాక్టర్ శివనాయక్ బృందం ఖాసింబీకి శస్త్ర చికిత్స చేసి ప్లీహాన్ని తొలగించారు. సాధారణ ప్లీహం 12 సెంమీ ఉంటుందని, ఖాసింబీ కడుపులో 34 సెంమీ ఉండి నాలుగున్నర కేజీల బరువు ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉందని చెప్పారు.



తొలగించిన ప్లీహాన్ని చూపుతున్న వైద్యులు

రహదారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

దర్శి: రహదారి భద్రతకు డ్రైవర్‌లు ప్రధాన్యం ఇవ్వాలని ఎంవీఐ రవికుమార్ సూచించారు. స్థానిక ఎంవీఐ కార్యాలయంలో 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్నాయి. అందులో భాగంగా మొదటి రోజు డ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవీఐ రవి మాట్లాడుతూ వాహనాలు అతివేగంగా నడపడం, మద్యం తాగి వాహనాలు నడపడం మానుకోవాలని డ్రైవర్‌లకు సూచించారు. అనుమతి మించి ఎక్కువ మంది ప్యాసింజర్లను ఎక్కించుకుంటే వాహన సామర్థ్యం తగ్గి ప్రమాదాల బారిన పడతారని చెప్పారు. వాహనం నడిపేటప్పుడు తమ కుటుంబాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం రహదారి భద్రతకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంవీఐ రవికుమార్

ప్రమాదాల నివారణకు చర్యలు



బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ సంపత్‌కుమార్

ముండ్లమూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు ఎస్‌ఐ ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పని చేసిన ఎస్‌ఐ మల్లికార్జునరావు బదిలీపై వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో ఒంగోలులో పని చేస్తున్న ఎస్‌ఐ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. సమస్యాత్మక గ్రామాల్లో నిఘా పెంచి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు. ఎస్‌ఐని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

టీచర్ ఇంట్లో చోరీ

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో నివాసం ఉండే టీచర్ కోటేశ్వరరావు ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. కోటేశ్వరరావు సంక్రాంతి పండగకు స్వగ్రామం మేదరమెట్ల వెళ్లి బుధవారం ఉదయం ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం పగలకొట్టి బీరువాలో ఉన్న 6 వేల నగదును తీసుకెళ్లినట్లు ఆయన తన ఫిర్యాదులో పెర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి



ఎస్పీ మలికాగర్గ్‌కు వినతి పత్రం ఇస్తున్న కాటమాల చెన్నకేశవరావు

కంభం: స్థానిక సర్కిల్ పరిధిలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని షెడ్యూల్డు కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఎస్పీ మలికాగర్గ్‌ను కోరారు. సోమవారం కంభం పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ఎస్పీని ఆయన శాలువాతో సన్మానించి అంబేడ్కర్ డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. ఈ ప్రాంతంలో ఫ్యామిలీ గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయని, స్టేషన్‌కు వచ్చిన వారిని డిపార్టుమెంట్ ద్వారా కౌన్సిలింగ్ ఇస్తే వారు కలిసి జీవించే వీలుంటుందన్నారు. అటువంటి వారి కోసం ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్పీకి ఆయన వినతి పత్రం అందజేశారు.

కూలీలకు గిరాకీ



పొలంలో మిర్చి కోస్తున్న కూలీలు

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లో వేసిన మిరప పంట చేతికొచ్చే సమయంలో కూలీలకు గిరాకీ పెరిగింది. అన్ని గ్రామాల్లో రైతులు ఒకేసారి మిరప కోతలు ప్రారంభించడంతో రోజు కూలి ధర రూ.300 నుంచి రూ.400 వరకు పెరిగింది. ఎకరా మిరపకాయల కోతకు ఖర్చు సుమారు రూ.35 నుంచి రూ.40 వేలు అవుతుందని రైతులు చెప్తున్నారు. పెద్దన్నపాలెం, వెంకటాపురం, భూమనపల్లి, ఇండ్లచెరువు, పోలేపల్లి, రామిరెడ్డిపల్లి, లక్ష్మీపురం, రుద్రసముద్రం, మంగినపూడి, బసిరెడ్డిపల్లి, పుల్లయిపల్లి, రామాపురం గ్రామాల్లో సుమారు 650 హెక్టార్లలో మిరప పంటపై రైతులు దృష్టి సారించారు. ఇతర మండలాల నుంచి కూలీలు ట్రాక్టర్‌లు, ఆటోల్లో వందల సంఖ్యల్లో వస్తున్నారు. కూలి ధరలు పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు యార్డులో మిర్చికి నాణ్యమైన ధర పలుకుతోంది.

నేడు గంధ మహోత్సవం



నాగూర్‌మీరా ఆవలియా దర్గా

కురిచేడు: స్థానిక నాగూర్ మీరా ఆవలియా 81వ గంధ మహోత్సవం గురువారం జరగనుంది. కులమతాలకతీతంగా నాగూర్ మీరా ఆవలియా దర్గా వద్ద ప్రజలు మొక్కలు తీర్చుకుంటారు. గురువారం రాత్రికి భక్తుల సౌకర్యార్థం తాగునీరు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారు జామున స్వామివారి గంధ గ్రామోత్సవం చేయనున్నారు.

శ్రీవారి ఆలయంలో వసంతోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి వసంతోత్సవం నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఆలయంలో శ్రీవారి ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం జరిపించారు. ఆ మేరకు బుధవారం పదహారు రోజుల పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారిని దర్శించుకొని పునీతులయ్యారు. వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వసంతోత్సవం నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ వేదపండితులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీవారి విశిష్టతను భక్తులకు వివరించారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పూజా కార్యక్రమాల్లో పాల్గొని శ్రీవారిని దర్శించుకొన్నారు. అనంతరం ఆలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు

ఎరువుల వాడకం తగ్గించాలి

తాళ్లూరు: రైతులు ఎరువుల వాడకం తగ్గించి వ్యవసాయాధికారుల సిఫారసు చేసిన మేరకే నత్రకజని, భాస్వరం, పొటాష్ వాడాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరులో బుధవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అధికంగా, అనవసరంగా ఒక పోషకం వాడితే అది మరొక పోషక లోపానికి దారితీస్తుందన్నారు. పంట కాలంలో వాడాల్సిన ఎరువులు రెండు విడతల్లో వేస్తే దిగుబడి తగ్గుతుందన్నారు. పంట దశ ఆధారంగా ఎరువులు వాడాల్సిన అవసరం ఉందన్నారు. అనవసరంంగా ఎక్కువ మోతాదులో ఎరువులు వాడితే ఖర్చు తప్ప ఫలితం శూన్యమన్నారు. నాయక్,వెంకటరావు, ఏఈఓ నాగరాజు వెంకటరెడ్డిపాల్గొన్నారు.